ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కలిసిన భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్..

బీఆర్ఎస్ గెలుపునకు సహకరించండి

- నేతల మద్దతు కూడగడుతున్న 'క్యామ' మల్లేశ్
- సీనియర్ నేతలతో వరుస భేటీలు

ఇబ్రహీంపట్నం, మార్చి 25 : భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ బీఆర్ఎస్ నేతల మద్దతు కూడగడుతున్నారు. ఇబ్రహీంపట్నం, మునుగోడు, భువనగిరి, ఆలేరు, తుంగతుర్తి, జనగామ తదితర నియోజకవర్గాల్లో ముఖ్యనాయకులను వరుసగా కలుస్తున్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి స్వగ్రామమైన ఎలిమినేడుకు వెళ్లి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పనిచేస్తే బీఆర్ఎస్ సునాయాసంగా గెలుస్తుందని, నాయకులంతా సమిష్టిగా కృషి చేయాలని కోరారు. సోమవారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కలుసుకున్నారు. భువనగిరిలో బీఆర్ఎస్ పార్టీ గెలవాల్సిన అవసరం ఉందని, ప్రతి నాయకుడు, కార్యకర్త ముందుకు రావాలని మల్లేశ్ కోరారు.

కాంగ్రెస్ మెడలు వంచుతం

మొదటిపేజీ తరువాయి...

మరోవైపు పంటలు ఎండిపోతున్నాయని, అయినప్పటికీ ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు అయినా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌తో కలిసి హరీశ్‌రావు మీడియా సమావేశంలో మాట్లాడారు. పంట నష్టాన్ని వెంటనే అంచనా వేసి ఎకరానికి రూ. 25 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీపై బీఆర్ఎస్ తరపున పోరాడతామని భరోసా ఇచ్చారు.

మ్యానిఫెస్టోలోని ఒక్క హామీ అయినా నెరవేర్చారా?

ఆదివారం వరంగల్ జిల్లా దేవరుప్పుల మండలం లక్ష్మీబాయితండాలో పర్యటించి రైతులతో మాట్లాడితే వారి దయనీయ పరిస్థితులు తెలిశాయని హరీశ్‌రావు చెప్పారు. గ్రామంలో ఒక్కో రైతు నాలుగు నుంచి 8 బోర్ల వరకు వేసి లక్షల్లో అప్పుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. బోర్లు వేసేందుకు, పూడికలు తీసేందుకు బోర్ యంత్రాలు, క్రేన్లను తెప్పించుకుంటున్నారని తెలిపారు. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి లేదని పేర్కొన్నారు. తండాల్లోకి తాగునీరు కూడా సరిగా రావడం లేదని చెప్పారు. మ్యానిఫెస్టోలో పేర్కొన్న ఒక్క హామీని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు అమలు చేయలేదని విమర్శించారు. డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని ప్రకటించారని, రైతుబందు కింద ఎకరానికి రూ.15 వేలు, క్వింటాల్ వరికి రూ.500 ప్రోత్సాహకం, కౌలు రైతులకు రైతుబంధు అమలు చేస్తామన్నాని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు అమలు చేయలేదని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో ఏ ముఖం పెట్టుకుని రైతులను ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. పంట నష్టపోయిన రైతులను పరామర్శించేందుకు ముఖ్యమంత్రికి, మంత్రులకు సమయమే దొరకడం లేదని ఎద్దేవా చేశారు. పంటనష్టాన్ని అంచనా వేసేందుకు అధికారులను కూడా క్షేత్రస్థాయికి పంపించడం లేదని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఎకరాల్లో పంట ఎండిపోయిందని తమకు ప్రాథమిక సమాచారం ఉందని, ఇప్పటి వరకు 180 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు.

తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు. చిత్రంలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

బ్యాంకు అధికారులా.. రజాకార్లా?

రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని చెప్తూ రైతులకు బ్యాంకు అధికారులు నోటీసులు పంపిస్తున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా రేగోడు మండలంలో ఏపీజీవీబీ బ్యాంకు అధికారులు రుణాలు చెల్లించాలంటూ రైతులకు లీగల్ నోటీసులు పంపించారని తెలిపారు. గ్రామాల్లోకి వెళ్లి బకాయిలు కట్టాలని రైతులను వేధిస్తున్నారని, కట్టకుంటే ఆస్తులు సీజ్ చేస్తాం, కోర్టుకు లాగుతామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. అధికారుల్లా కాక రజాకార్లలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా డిసెంబర్ 9న రుణమాఫీపై తొలి సంతకం పెడతానని ప్రకటించిన రేవంత్‌రెడ్డి రైతులను దగా చేశారని విరుచుకుపడ్డారు. పార్టీ గేట్లు తెరవడంపై రేవంత్‌కు ఉన్న శ్రద్ధ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంపై లేదని విమర్శించారు. ప్రతిపక్ష నేతల ఇండ్లలోకి వెళ్లి రేవంత్‌రెడ్డి బతిమలాడి వారికి కండువాలు కప్పుతున్నారని ఎద్దేవా చేశారు.

కాంగ్రెస్ నేత లంచాలకు రైతన్న బలి

జనగామ నియోజకవర్గంలోని బచ్చన్నపేటలో కాంగ్రెస్ నేతల లాంచాలకు ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ధరణి లో మార్పులు అంటూ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 95 శాతం పట్టాలు, 1.55 కోట్ల ఎకరాలకు గతంలోనే పట్టాలు ఇచ్చామని తెలిపారు. రైతులకు భూమి హక్కులపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ అనేది సెంటిమెంట్ కాదని పేర్కొన్నారు. ఇక్కడి ప్రజలు ఎదుర్కొన్న కష్టాల కారణంగానే ఉద్యమం వచ్చిందని తెలిపారు. రైతు సమస్యలపై మాట్లాడితే కాంగ్రెస్ నేతలకు సెంటిమెంట్ గా కనిపిస్తున్నదని మండిపడ్డారు. తెలంగాణ వాదం, రైతుల సమస్యలను సెంటిమెంట్ అనేవాళ్ళు సెంటి 'మెంటల్‌గాళ్లు' అని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రైతుల కేంద్రంగా నడిస్తే.. ప్రస్తుత ప్రభుత్వానికి రైతుల ధ్యాసే లేదని మండిపడ్డారు.

మోసం చేసినందుకు ఓట్లు అడుగుతరా?

> బాండు పేపర్లు రాసిచ్చి రైతులను మోసం చేసినందుకు ఓట్లు అడుగుతరా? పదేండ్లలో ఎన్నడూ లేని విధంగా 20 ఎకరాల్లో పంటలు ఎండబెట్టినందుకు ఓట్లు అడుగుతరా? నీటి నిర్వహణలో వైఫల్యం చెందినందుకు, కరెంటు సరిగా ఇవ్వలేకపోయినందుకు, మోటార్లను కాలబెటినందుకు ఓట్లు అడుగుతరా?
>
> -హరీశ్‌రావు

సచివాలయాన్ని ముట్టడిస్తాం

> రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వకుంటే లక్షలాదిమంది రైతులతో సచివాలయాన్ని ముట్టడిస్తాం. వరి మద్దతు ధరకు అదనంగా రూ. 500 బోనస్ ఇవ్వాల్సిందే. తప్పించుకోవాలని చూస్తే కలెక్టర్ కార్యాలయాలను ముట్టడిస్తాం. రైతులు ధైర్యంగా ఉండండి. ఆత్మహత్యలు వద్దు.
>
> -హరీశ్‌రావు

నేటి నుంచి పంట పొలాల సందర్శన

రాష్ట్రంలోని రైతుల పరిస్థితిపై పార్టీ అధ్యక్షుడు కే చంద్రశేఖర్‌రావు సోమవారం పార్టీ ముఖ్యనాయకులతో మాట్లాడారని, రైతుల పొలాలు సందర్శించాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారని హరీశ్‌రావు తెలిపారు. మంగళవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా వడగండ్ల వానతో దెబ్బతిన్న పంటలను, కరెంటు, నీళ్లు లేక ఎండిపోయిన పంట పొలాలను పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, జడ్పీ చైర్మన్‌లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పరిశీలిస్తారని తెలిపారు. గ్రామాలు, రైతుల వారీగా జరిగిన నష్టం అంచనాలను బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయానికి పంపించాలని, ఆ నివేదికను ప్రభుత్వానికి అందిస్తామని తెలిపారు.

లోకం పోకడ



మీకు లోక్‌సభ సీట్లు కాదట... అటక మీద సీట్లట!

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	41.7°c	21.7°c
రంగారెడ్డి	39.9°c	20.4°c
ఖమ్మం	39.0°c	23.0°c
నిజామాబాద్	39.0°c	25.7°c
నల్లగొండ	38.0°c	23.0°c
మెదక్	37.8°c	22.1°c
వరంగల్	37.0°c	24.0°c
కరీంనగర్	37.0°c	25.0°c
హైదరాబాద్	37.0°c	26.6°c
మహబూబ్‌నగర్	36.9°c	26.0°c

నేడు కోర్టుకు ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ కవిత ఈడీ కస్టడీ మంగళవారంతో ముగియనున్నది. దీంతో ఈడీ అధికారులు బుధవారం ఉదయం 11.00 గంటలకు ఆమెను ఢిల్లీ రౌస్ ఎవెన్యూలోని ప్రత్యేక కోర్టులో హాజరుపరుచనున్నారు. ఈ సందర్భంగా ఈడీ తనను అక్రమంగా అరెస్ట్ చేసిందని కవిత మరోమారు న్యాయస్థానానికి తెలియజేయనున్నారు. కేవలం రాజకీయ కక్షతో నమోదైన కేసు అని వివరించనున్నారు. తనను విడుదల చేయాలని కోరనున్నారు.

ఈడీ అధికారులు ఈ నెల 15న కవితను అరెస్ట్ చేసి 16న కోర్టులో హాజరుపరిచిన సంగతి తెలిసిందే. మొదట వారం రోజులు కస్టడీ విధించిన కోర్టు.. 23వ తేదీన మరో మూడు రోజులు పొడిగించింది.

దర్యాప్తు సంస్థల దుర్వినియోగంపై ఈసీ దృష్టి

న్యూఢిల్లీ, మార్చి 25: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నదన్న ప్రతిపక్షాల ఆరోపణలపై ఎన్నికల సంఘం దృష్టి పెట్టింది. ఇందుకు సంబంధించి త్వరలో అడ్వైజరీ జారీచేయనున్నట్టు సమాచారం. లోక్‌సభ ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతలపై కేంద్ర దర్యాప్తు సంస్థల వరుస చర్యలను ఎత్తిచూపుతూ ఇలాంటి అరెస్టులు, దాడులను

త్వరలో అడ్వైజరీ

ముందస్తుగా పరిశీలించేందుకు ఒక యంత్రాంగాన్ని అభివృద్ధి చేయాలని ప్రతిపక్షాలు ఈసీకి సూచించాయి. జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సొరెన్ అరెస్ట్, ఇటీవల కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను స్తంభింప చేయటాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించాయి. ఆమ్ ఆద్మీ పార్టీ కూడా కేజ్రీవాల్ అరెస్ట్‌పై ఈసీకి విడిగా లేఖ రాసింది. ఎన్నికల సంఘం వీటన్నింటినీ పరిశీలనకు తీసుకున్నది. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో దర్యాప్తు సంస్థలకు ఈసీ జారీ చేసిన సలహాను ప్రతిపక్షాలు మరోసారి గుర్తు చేశాయి. ఎన్నికల సమయంలో కేంద్ర దర్యాప్తు సంస్థలు తటస్థంగా ఉండాలని అప్పట్లో ఈసీ తెలియచేసింది.

మండే ఎండలు

- మూడు రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- 28, 29, 30 తేదీల్లో మరింత పెరిగే చాన్స్
- వాతావరణశాఖ అధికారిణి శ్రావణి వెల్లడి

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండుతున్నాయి. ముఖ్యంగా మూడు, నాలుగు రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాత్రివేళ ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ నెల 28, 29, 30 తేదీల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నట్టు వాతావరణ అధికారిణి శ్రావణి వెల్లడించారు. రాత్రి ఉష్ణోగ్రతలు 25 నుంచి 26 డిగ్రీల వరకు నమోదవుతాయని తెలిపారు. ఏప్రిల్ రెండో వారం నుంచి ఎండల తీవ్రత మరింత పెరుగనున్నట్టు పేర్కొన్నారు. ఏప్రిల్, మే నెలల్లో ఉత్తర, పశ్చిమ తెలంగాణ జిల్లాల్లో వడగాల్పులు అధికంగా ఉంటాయన్నారు.

ఉత్తర తెలంగాణలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు

గతవారం వర్షపాత సూచనలు ఉన్నప్పటికీ.. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో 39.3 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని శ్రావణి తెలిపారు. ఆదిలాబాద్, నిజామాబాద్ పరిసర ప్రాంతాల్లో 39 డిగ్రీలు, మధ్య తెలంగాణ జిల్లాల్లో 36 నుంచి 35 డిగ్రీలు, దక్షిణ తెలంగాణ జిల్లాలైన నల్లగొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్ జిల్లాల పరిసర ప్రాంతాల్లో 37 నుంచి 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వచ్చే 24 గంటల్లో 39 డిగ్రీల కంటే ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలున్నట్టు పేర్కొన్నారు.

ఏప్రిల్, మే నెలల్లో వడగాల్పులు, పిడుగులు

మార్చి నెల చివరి నాటికి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు నమోదయ్యే అవకాశముంటుందని శ్రావణి వెల్లడించారు. ఉత్తర, పశ్చిమ తెలంగాణ జిల్లాల్లో ఏప్రిల్ రెండో వారంలో వడగాల్పులు వీచే అవకాశం ఉన్నట్టు పేర్కొన్నారు. ఉష్ణోగ్రతల వల్ల ట్రోణి ఏర్పడుతుందని, ఫలితంగా సాయంత్రం వేళలో ఉరుములు, మెరుపులతో వర్షాలు పడతాయని తెలిపారు. ఏప్రిల్ మూడు, 4వ వారం, మే నెలల్లో పిడుగుల ప్రభావం ఉంటుందని తెలిపారు. 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడు వడగాల్పులు వీస్తాయని, ఉష్ణోగ్రతలు అత్యధికంగా ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల మధ్య ఉంటాయని తెలిపారు. ఏప్రిల్, మే నెలల్లో హైదరాబాద్‌లో ఒకటి, రెండుసార్లు వడగాలులు వీస్తాయని తెలిపారు. హైదరాబాద్‌లో 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉన్నప్పటికీ, కాంక్రీట్ నిర్మాణాల వల్ల వేడి ఎక్కువగా ఉంటుందని ఆమె వివరించారు.

మీరు చేస్తున్నదే.. మేం అప్పుడు చేశాం!

మొదటిపేజీ తరువాయి...

చేయించారు. పోలీసు వృత్తిలో ఇది ఒక భాగం. మా ఇంట్లో సోదాలు చేయాల్సిన అవసరమేమొచ్చింది. మనం మనం పోలీసులం' అని ప్రభాకర్‌రావు మాట్లాడటంతో సదరు అధికారి, మీరు ఏమి చెప్పాలనుకున్నా ఈ మెయిల్ ద్వారా అధికారికంగా పంపించాలని సూచించి ఫోన్ కట్ చేశారని తెలిసింది.

కస్టడీ పిటిషన్‌పై వాదనలు

ప్రణీత్‌రావు కస్టడీలో ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా ఎస్ఐబీ మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నను అరెస్టు చేయడంతో న్యాయస్థానం వాళ్లిద్దరికి 14 రోజులు రిమాండ్ విధించింది. ఈ ముగ్గురు ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో ఉన్న సంగతి తెలిసిందే. అయితే, ఇద్దరు ఏఎస్పీలను కస్టడీకి ఇవ్వాలంటూ ఇప్పటికే పంజాగుట్ట పోలీసులు కోర్టును ఆశ్రయించడంతో మంగళవారం ఈ పిటిషన్‌పై వాదనలు జరిగే అవకాశాలున్నాయి. మావోయిస్టులు, టెర్రరిస్టులు, దేశ భద్రతకు ముప్పు వాటిల్లుతుందని భావించే వారి ఫోన్ నంబర్లను అధికారికంగా దేశంతోపాటు ఆయా రాష్ట్రాల ఇంటెలిజెన్స్ వ్యవస్థలు ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తూ ఉంటాయి. దీనిని ఆసరగా చేసుకొని ప్రణీత్ రావు, భుజంగరావు, తిరుపతన్నలు రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలకు పనిచేశారని విచారణలో విచారణలో తేలింది. ఎస్ఐబీలో ఎప్పటి నుంచి ప్రైవేట్ వ్యక్తుల ఫోన్లను ట్యాప్ చేశారు? నిబంధనలకు విరుద్ధంగా వాడుతున్న సాఫ్ట్‌వేర్లు ఏమిటి? అనే అంశాలపై ప్రణీత్‌రావును ప్రత్యేక బృందం ప్రశ్నించినట్టు తెలిసింది.

మూసీ నుంచి హార్డ్‌డిస్క్ శకలాలు స్వాధీనం!

భుజంగరావు, తిరుపతన్నలు ప్రణీత్‌రావుపై అధికారుల నుంచి వచ్చిన ఆదేశాలతోపాటు వ్యాపారులు, అక్రమ దందాలు చేసేవారి నంబర్లను ట్యాప్ చేసి అక్రమ సంపాదనకు కూడా తెరలేపినట్టు విచారణలో బయటపడింది. అక్రమ సంపాదనతో కొన్న ఆస్తులు బినామీల పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించినట్టు పోలీసులు అనుమానిస్తూ ఆ దిశగా దర్యాప్తు జరుపుతున్నారు. చాదర్‌ఘాట్ వద్ద మూసీలో పడవేసిన హార్డ్‌డిస్కుల శకలాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. కాగా, ఎస్ఐబీలో పనిచేసే కొందరు అధికారులు ఫోన్ ట్యాపింగ్ పాల్పడుతున్నట్టు తమకు సమాచారం ఉన్నదని, అలా చేయడం నేరమంటూ వారించడంతో తమను ఇతర విభాగాలకు బదిలీ చేశారంటూ కొందరు అధికారులు చర్చించుకుంటున్నారు. అలాంటి వారిని కూడా ప్రస్తుతం దర్యాప్తు అధికారులు ఆరా తీసి, ఈ కేసులో సాక్షులుగా చేర్చే అవకాశాలున్నాయి.

టెక్నికల్ కన్సల్టెంట్..!

ఎస్ఐబీ టెక్నికల్ కన్సల్టెంట్‌గా పనిచేసిన రవి అనే వ్యక్తి ఇజ్రాయెల్ నుంచి ఫోన్ ట్యాపింగ్ డివైస్, సాఫ్ట్‌వేర్లు తెప్పించారని విచారణలో బయటకు వచ్చింది. ఈ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి విపక్షాలు, రాజకీయ నాయకుల ఫోన్లు ట్యాప్ చేశారని చర్చ జరుగుతున్నది. ఫోన్ ట్యాపింగ్ చేయలంటే తప్పని సరిగా ఆయా సెల్‌ఫోన్ ప్రొవైడర్ల అనుమతి తప్పనిసరి. కానీ, నిబంధనలు ఉల్లంఘించి సాఫ్ట్‌వేర్లతో ఫోన్లను హ్యాక్ చేయడం చట్టపరిధిని దాటి చేయడమేనని కొందరు అధికారులు తెలిపారు. ఈ కేసులో టెక్నికల్ కన్సల్టెంట్‌ను పోలీసులు విచారించేందుకు సిద్ధమవుతున్నారు. ఇతడిచ్చే సమాచారంతో ఫోన్ హ్యాకింగ్ సాఫ్ట్‌వేర్‌పై మరింత స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. అసలు ఇజ్రాయెల్ నుంచి తెచ్చిన సాఫ్ట్‌వేర్ ఏంటి అనే సమాచారాన్ని పోలీసులు తెలుసుకోనున్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు 43.2% డీఏ

బకాయిలన్నీ చెల్లించనున్న ప్రభుత్వం

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): వేతన సవరణలో భాగంగా తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు 43.2శాతం కరువు భత్యం(డీఏ) ఖరారైంది. ఇటీవల జరిగిన వేతన సవరణలో ఆర్టీసీ ఉద్యోగులకు రావల్సిన 82.6 శాతం డీఏ బకాయిలలో ప్రభుత్వం 31.1 శాతాన్ని మూల వేతనంలో కలిపింది. ఇంకా 51.5 శాతం డీఏ బకాయి ఉండగా.. దానిని 43.2 శాతం వద్ద స్థిరీకరించింది. వేతన సవరణ అనంతరం వచ్చే మూల వేతనంపై 43.2 శాతం డీఏను లెక్కించి జీతంతోపాటు చెల్లించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు చేసిన వేతన సవరణ నిబంధనలను ఆర్టీసీకి కూడా వర్తింపజేయడంతో ఇంటి అద్దె భత్యం (హెచ్ఆర్ఏ) తగ్గిపోయింది. దీంతో కొత్త జీతం ఆశించిన స్థాయిలో పెరగలేదన్న నిరాశలో ఉద్యోగులు ఉన్నారు. అయితే బకాయి పడిన కరువు భత్యాన్ని చెల్లించేందుకు ప్రభుత్వం ముందుకు రావడంతో ఆ లోటు కొంతమేర తీరినట్టేనని భావిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇప్పటికీ నాలుగు విడతల డీఏ బకాయిలు పేరుకుపోయి ఉన్నాయి. కానీ ఆర్టీసీ ఉద్యోగులకు మాత్రం అన్ని విడతల డీఏలు చెల్లించటం విశేషం. 2024 జనవరి విడతకు సంబంధించి 3.9 శాతాన్ని కూడా తాజా వేతన సవరణలో భాగంగా చెల్లించనున్నారు. గతంలో ఆర్టీసీ ఉద్యోగులకు ఏకంగా ఏడు విడతల డీఏ బకాయిలు పేరుకుపోయి ఉండేవి. అయితే కార్మిక సంఘాల ఒత్తిడి, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ కృషి ఫలితంగా తక్కువ సమయంలోనే ప్రభుత్వం డీఏ బకాయిలను చెల్లించిందని కార్మికులు భావిస్తున్నారు.

..బాండ్ బాజా!

మొదటిపేజీ తరువాయి...

పైగా ఉద్యోగులు పదవీ విమరణ పొందనున్నారు. వీరిలో ఒక్కో ఉద్యోగికి రూ. 35లక్షల నుంచి గరిష్ఠంగా రూ.కోటి వరకు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ఈ ఒక్క ఏడాదిలోనే రూ. 40వేల కోట్లకు పైగా ప్రభుత్వంపై భారం పడనుంది. అసలే ఆర్థికంగా కష్టాల్లో కూరుకుపోయిన రేవంత్ సర్కారు ఇప్పటికిప్పుడు రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించే అవకాశాలు లేవన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉద్యోగులకు ఇవ్వాల్సిన జీపీఎఫ్, గ్రాట్యూటీ, పెన్షన్ వంటి వాటిని బాండ్ల రూపంలో ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు ప్రభుత్వ వర్గాల ద్వారా తెలిసింది. ఇదే జరిగితే పదవీ విరమణ పొందిన వారంతా అటు వేతనాలు రాక, ఇటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి తలెత్తనుంది.

ఐదేండ్లల్లో 44వేల మంది

ప్రభుత్వ వర్గాల కథనం ప్రకారం రాబోయే ఐదేండ్లలో 44వేల మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందనున్నారు. ఇక నుంచి ఏడాదికి 8 నుంచి 10 వేల చొప్పున ఉద్యోగులు పదవీ విరమణ పొందుతారు. ప్రస్తుతం రాష్ట్రంలో 3,69,200 మంది ప్రభుత్వ ఉద్యోగులున్నారు. ఈ ఐదేండ్లలో 44వేల మంది వైదొలగడంతో ఉద్యోగుల సంఖ్య 3.25లక్షలకు చేరనుంది. ఇక పెన్షనర్ల సంఖ్య ప్రస్తుతం 2.88లక్షలుండగా, రాబోయే ఐదేండ్లల్లో 3.32లక్షలకు చేరనుంది. దీని ప్రభావం పాలనపైనా పడుతుందని నిపుణులు అంచనాలేస్తున్నారు.

ఏటా వేతన వ్యయం రూ.55 వేల కోట్లు

రాష్ట్ర ఖజానా నుంచి ఏటా రూ.55వేల కోట్ల వరకు (రెవెన్యూలో 35 శాతం) ఉద్యోగుల వేతనాలు, పెన్షనర్ల భత్యం చెల్లింపులకే వెళ్తున్నాయి. వాస్తవానికి పీఆర్సీలు, ఫిట్‌మెంట్‌ల అమలుతో ఉద్యోగుల వేతనాలు, పెన్షనర్ల భత్యం భారీగా పెరిగాయి. 2014 నుంచి 23 వరకు ఈ చెల్లింపులు మూడు రెట్లు పెరిగాయి. ఒక్క 2023 -24 ఆర్థిక సంవత్సరంలోనే ఉద్యోగుల జీతాలు, పెన్షన్ల చెల్లింపునకు రూ. 55,925 కోట్లు వెచ్చిస్తున్నారు. వీటిలో రెగ్యులర్ ఉద్యోగుల వేతనాలు రూ.40,109 కోట్లుండగా, పెన్షనర్లకు ఇచ్చేవి రూ.15,816 కోట్లున్నాయి. రాష్ట్రం ఏర్పాటైనప్పుడు 2014లో వేతనాలు, పెన్షనర్ల చెల్లింపులు కేవలం రూ. 17,130 కోట్లు మాత్రమే ఉండేది. 2021-22కు వచ్చేసరికి ఇది రూ.48,809 కోట్లకు, 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.55,925 కోట్లకు చేరుకుంది. పెన్షనర్ల భత్యం 2024లో రూ. 4,210 కోట్లుండగా, 2023కు వచ్చేసరికి రూ. 15వేల కోట్లకు చేరింది. తాజా పదవీ విరమణలతో పెన్షనర్ల భత్యం మరింతగా పెరిగే అవకాశముంది.

క్షమాపణలు చెప్పి.. 10 కోట్లు చెల్లించండి

- మీడియా సంస్థలకు కేటీఆర్ బావమరిది రాజేంద్రప్రసాద్ లీగల్ నోటీసులు
- రాడిసన్ బ్లూ హోటల్ డ్రగ్స్ కేసులో అసత్య కథనాలపై ఆగ్రహం
- వారంలోపు స్పందించాలని ఆదేశం
- లేకుంటే చిక్కులు తప్పవని హెచ్చరిక

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): రాడిసన్ బ్లూ హోటల్‌లో పట్టుబడిన డ్రగ్స్ కేసులో తనపై తప్పుడు వార్తలు ప్రసారం చేశాయంటూ 16 మీడియా సంస్థలకు కేటీఆర్ బావమరిది పాకాల రాజేంద్రప్రసాద్ లీగల్ నోటీసులు పంపించారు. తప్పుడు వార్తలు రాసిన ఆయా మీడియా సంస్థలు తనకు తక్షణం బహిరంగ క్షమాపణలు చెప్పడంతోపాటు తన పరువుకు భంగం కలిగించినందుకు ఒక్కో సంస్థ రూ. 10 నష్టపరిహారం చెల్లించాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. వీటితోపాటు గూగుల్, యూట్యూబ్ చానళ్లకు కూడా నోటీసులు జారీచేశారు. ఫిబ్రవరి 24న రాడిసన్ బ్లూ హోటల్‌పై దాడిచేసిన పోలీసులు డ్రగ్స్ పట్టుకున్నారు. ఈ కేసులో కేటీఆర్ బావమరిది పాకాల రాజేంద్రప్రసాద్ ప్రధాన సూత్రధారి అంటూ మీడియాలో వార్తలు వచ్చాయి. బీఆర్ఎస్ నేత, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీయడమే లక్ష్యంగా కథనాలు ప్రసారం చేశారు. ఈ ఘటన తర్వాత పోలీసులు కానీ, విచారణ సంస్థలు కానీ రాజేంద్రప్రసాద్‌ను నిందితుడిగా ఎక్కడా పేర్కొనలేదు. ఆయనను సంప్రదించలేదు. అయినప్పటికీ మీడియా సంస్థలు మాత్రం ఆయనను లక్ష్యంగా చేసుకుని వార్తలు ప్రసారం చేశాయి.

తప్పుడు వార్తలు రాసిన మీడియా సంస్థలు ఇవే

- సమయం (టైమ్స్ ఆఫ్ ఇండియా)
- హిట్ టీవీ తెలుగు మీడియా ప్రైవేట్ లిమిటెడ్
- హైదరాబాద్ మీడియా హౌస్
- తుపాజ్ ప్రైవేట్ లిమిటెడ్
- హ్యాష్‌ట్యాగ్ యూ
- ఏషియన్ ఎక్స్‌టీ డిజిటల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్
- ఏషియానెట్ న్యూస్ తెలుగు
- ఆంధ్రా విజన్
- స్లాష్ మీడియా అండ్ టెక్నాలజీస్
- యోయో మీడియా ప్రైవేట్ లిమిటెడ్
- ఒకేటీవీ మీడియా అండ్ బ్రాడ్‌కాస్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్
- ప్రవాస మీడియా ఎల్ఎల్పీ
- వైల్డ్ వూల్ఫ్ న్యూస్
- కాకోజీ టీవీ(దాసరి శ్రీనివాస్)
- యూట్యూబ్ ఇన్
- గూగుల్ ఎల్ఎల్సీ

వాటిని తొలగించి క్షమాపణ చెప్పండి

రాడిసన్ బ్లూ హోటల్‌లో దొరికిన డ్రగ్స్‌కు తనకు ఎలాంటి సంబంధమూ లేకపోయినా తానే సూత్రధారినంటూ వార్తలు ప్రసారం చేసిన మీడియా సంస్థలు తన పరువుకు నష్టం కలిగించాయని, నిరాధార వార్తలు ప్రసారం చేశారని పేర్కొంటూ తాజాగా రాజేంద